
# సాక్షి ఒడిశా

శనివారం । 29 । జూలై । 2023



**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,96,400లు, బంగారం 4.7 గ్రాములు, వెండి 49.3 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



**సరిహద్దుల్లో 'ఐ' అలర్ట్**

- IIలో



**'మణిపూర్' నిందితులను కఠినంగా శిక్షించాలి**

- IIలో

## న్యూస్‌రీల్

### సనో నదిలో యువకుడి గల్లంతు



నదిలో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



సుబొంగో సాబోరో(ఫైల్)

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి భీమపూర్ పంచాయతీ మాల్‌పొదోరో గ్రామానికి చెందిన యువకుడు సుబొంగో సాబోరో(25) సనో నదిలో గల్లంతయ్యాడు. అతని ఆచూకీ కోసం గుణుపూర్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, గ్రామస్తులు తీవ్రంగా గాలిస్తున్నారు. యువకుడు బుధవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. గురువారం ఉదయం నది వైపు వెళ్లిన గ్రామస్తులకు ఒడ్డున సుబొంగోకు చెందిన బట్టలు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో నదిలో స్నానానికి దిగి, వరద ఉధృతితో గల్లంతయి నట్లు భావిస్తున్నారు. దీంతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

### పిడుగుపాటుకు 12 మేకలు మృతి



ఘటనా స్థలంలో మృతిచెంది ఉన్న మేకలు

మల్కన్‌గిరి: జిల్లాలోని కొయిర్‌పుట్ సమితిలో పిడుగులు పడి 12మేకలు మృతిచెందాయి. లమతాగుడ గ్రామానికి చెందిన దుర్యోధన్ తన మేకలను బుధవారం ఉదయం మేతకు తీసుకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి తరలిస్తున్న సమయంలో వర్షం కురవడంతో చెట్టు నీడకు చేరగా, అకస్మాత్తుగా పిడుగు పడటంతో జీవాలు మృతిచెందాయి. స్పృహ కోల్పోయిన దుర్యోధన్‌ను గమనించిన గ్రామస్తులు ఖొయిర్‌పుట్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గురువారం ఉదయానికి స్వల్పంగా కోలుకున్నాడని వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా బాధితుడికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

### వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛ సాథీలు, ఆరోగ్య కార్యకర్తలు

పర్లాకిమిడి: మలేరియా, డెంగీ, డయోరియా, కండ్ల కలకలు వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపాలిటీ పరిధి 9వ వార్డులో ఆశా వర్కర్లు, మున్సిపల్ స్వచ్ఛ సాథీలు, ఆరోగ్య కార్యకర్తలు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి, ప్రచారం చేశారు. వ్యాధులపై నిర్లక్ష్యం వద్దని, ఏ చిన్న అనారోగ్యమైనా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అలాగే ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నారాయణరావు బెహరా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### చారు మజుందార్‌కు నివాళులు



మజుందార్‌కు నివాళులర్పించిన నాయకులు


రాయగడ: సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ వ్యవస్థాపకులు కామ్రేడ్ చారు మజుందార్ వర్ధంతిని జిల్లాలోని గుణుపూర్ సమితి కుకురుగుడ, శ్రీరాంపూర్, తొటగుడ, లుంగురుతల్, చాలకొంబ తదితర ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు తిరుపతి గమాంగో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పేద, దళిత వర్గాల సంక్షేమం కోసం పోరాడిన మహానేతగా మజుందార్‌ను అభివర్ణించారు. కార్యక్రమంలో నాయకులు అనాసిస్ సాబోరా, సంజీవ్ సాబోరా, నిరంజన్ సాబోరా పాల్గొన్నారు.

# నల్లనయ్యా!



మసిబారిన ఛాయలో జగన్నాథుడు

- బొనొకొ లగ్గి అలంకరణపై వీడని ప్రతిష్టంభన
- సీఏఓపై ఆగ్రహంతో సేవకు దూరంగా ఉన్న సిబ్బంది
- శుక్రవారం జరిగిన చర్చలు సైతం విఫలం
- మసిబారిన ఛాయలోనే దర్శనమిస్తున్న జగన్నాథుడు



పూరీ శ్రీమందిరం

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం రత్న వేదికపై కళకళలాడుతూ కనిపించాల్సిన నల్లనయ్య.. మసిబారిన ఛాయలోనే భక్తులకు దర్శనమిస్తున్నాడు. బుధవారం జరగాల్సిన బొనొకొ లగ్గి సేవ నిర్ణీత వ్యవధిలో జరగక పోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దత్తమహాపాత్రొ వర్గం సేవకులు, శ్రీమందిరం ఆలయ పాలకాధికార వర్గం మధ్య ఏర్పడిన బేధాభిప్రాయాలు దీనికి కారణంగా చెప్పవచ్చు. ఈ ఏడాది స్వామివారు వార్షిక రథయాత్ర ముగించుకుని, రత్నవేదిక అలంకరించిన నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. మంగళ హారతి, ధూపం, ఇతరేతర నిత్య సేవాదులతో మూల విరాట్‌ల ముఖాలు మసి బారుతుంటాయి. అయితే ఈ పరిస్థితి బహిరంగం కాకుండా క్రమం తప్పకుండా దేవదారు మూర్తుల ముఖాలను అలంకరించడం ఆచారం. అయితే ఈ వ్యవహారంలో ఇరువర్గాల మధ్య పంతం బిగుసుకుంది. బుధవారం బొనొకొ లగ్గి నిర్వహించాలని అధికార వర్గం, గురువారం నిర్వహిస్తామని సేవాయత్ వర్గం పట్టు వీడకుండా వాదోపవాదాలు కొనసాగిస్తున్నాయి. ఈ రెండు వర్గాల పంతాల మధ్య రత్న వేదికపై చతుర్ధా మూర్తుల శోభ మసక బారుతోంది. ఈ ప్రతిష్టంభనకు ముగింపు ఎప్పుడో అంతుచిక్కని పరిస్థితి చోటు చేసుకుంది. ఇరువర్గాల మధ్య చర్చలు, సంప్రదింపులు, సమావేశాలు జరుగుతున్నా ప్రయోజనం లేకపోయింది. ఇదే తరహాలో బొనొకొ లగ్గి సేవ ఆచారంపై కొనసాగుతున్న ప్రతిష్టంభనకు తెర దించేందుకు నీతీ(సేవా) ఉపసంఘం శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించింది.

**అంతవరకు.. యథాతథం..**

నీతీ సబ్ కమిటీ సమావేశంలో బొనొకొ లగ్గి వివాదంపై విస్తృత చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో భిన్నమైన అభిప్రాయాలు వచ్చాయి. అభిప్రాయాలు ఏకీభవించక పోవడంతో ప్రతిష్టంభన తొలగని పరిస్థితులు కొనసాగుతున్నాయి. వివాదం పరిష్కారం ఆలయ పాలకమండలి దృష్టికి తీసుకు వెళ్లాలని నిర్ణయించారు. శ్రీమందిరం ఆచార వ్యవహారాల పాలనా తీరుకు సంబంధించి పాలకమండలి అత్యున్నత నిర్ణయాధికారం కలిగిన వర్గంగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బొనొకొలగ్గి వివాదం పాలకమండలి పరిష్కరించేందుకు ప్రతిపాదించారు. ఆగస్టు 1న ఆలయ నిర్వహణ కమిటీ సమావేశం జరుగుతుందని ప్రకటించారు. అంతవరకు బొనొకొ లగ్గి వివాదం కొనసాగుతున్నట్లేనని స్పష్టం అవుతోంది.

**అధికారుల తీరుతోనే..**

సమావేశం అనంతరం దత్తమహాపాత్రొ నియోగుల సంఘం అధ్యక్షుడు మదన్ దత్తమహాపాత్ర మీడియాతో మాట్లాడారు. గురువారం పూజలు నిర్వహించకుండా సేవకులను ఆలయ అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దీనికి బదులుగా బుధవారం బొనొకొ లగ్గి చేపట్టాలని పట్టుబడుతున్నారని తెలిపారు. ఈ వివాదం 2018నుంచి కొనసాగుతోందన్నారు. రికార్డులు, ఆచారాల ప్రకారం బొనొకొ లగ్గి సేవను బుధవారం లేదా గురువారం నిర్వహించవచ్చని పేర్కొన్నారు. అయితే బుధవారమే నిర్వహించాలని పాలకవర్గం ఎందుకు మొండిగా వ్యవహరిస్తుందో అంతుచిక్కడం లేదని విచారం వ్యక్తం చేశారు.

**కొలిక్కి రాని వివాదం..**

సేవయత్‌లు, సీఏఓ వర్గాల మధ్య జరిగిన సమావేశంలో సుదీర్ఘ చర్చ తప్ప, వివాదం కొలిక్కి రాలేదు. సమావేశం అనంతరం జగన్నాథ ఆలయ పరిపాలన(ఎస్‌జేటీఏ) చీఫ్ అడ్మినిస్ట్రేటర్ రంజన్ కుమార్ దాస్ మీడియాతో మాట్లాడారు. వార్షిక రథయాత్ర తర్వాత నీలాద్రి విజే నుంచి బొనొకొ లగ్గి పునఃప్రారంభించడంపై ఏకాభిప్రాయం సాధ్యం అవుతుందనే ఆశ నీరుగారి పోయిందని విచారం వ్యక్తం చేశారు. శ్రీమందిరంలో వారానికి ఒకసారి నిర్వహించే శ్రీ ముఖ ముస్తాబు(బొనొకొ లగ్గి) ఆచారానికి విఘాతం కలగడం ఇది వరుసగా మూడో వారమని తెలిపారు. దత్తమహాపాత్ర సేవకులు గురువారమే ఈ సేవ నిర్వహించాలని పట్టుబడుతుండగా, బుధవారం నిర్వహించాలని ఎస్‌జేటీఏ కోరినట్లు వివరించారు. నిబంధనలు, హక్కుల రికార్డును (ఆర్‌ఓఆర్) ఉటంకిస్తూ సేవాయత్ వర్గాన్ని ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఇంకా చర్చలకు సిద్ధంగా ఉన్నామమని, మూల విరాటుల సేవల ఆచారంలో ఈ అంతరాయాన్ని ముగింపు పలికేందుకు సేవకుల వర్గం సహకరించాలని కోరారు. ఈ వివాదం పరిష్కరించే దిశలో దాఖలైన అత్యధిక ప్రతిపాదనలు, హక్కుల రికార్డులు, నియమావళి బుధవారానికి అనుకూలంగా ఉన్నాయని గుర్తుచేశారు. ఏకాదశి లేదా ఇతర ఆచారాలు బుధవారం వస్తే బొనొకొలగ్గి సేవ గురువారానికి వాయిదా వేయవచ్చన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న శ్రీమందిరం సీఏఓ రంజన్‌కుమార్ దాస్

అయితే ఈ నిర్ణయం కూడా ఆలయ పాలకవర్గం తీసుకోవాల్సి ఉంటుందని ప్రత్యేకంగా ప్రస్తావించారు.

# శ్రీమందిరంలో హుండీ చోరీ

- భీముని విగ్రహం కింద హుండీని కాజేసిన దుండగులు



శ్రీమందిరం దక్షిణ ద్వారం

భువనేశ్వర్: పూరీ జగన్నాథ ఆలయం భద్రతా వ్యవస్థ డీలా పడింది. స్వామి నెలకొన్న శ్రీమందిరం దక్షిణద్వారం ఆవరణలో ఏర్పాటు చేసిన హుండీ చోరీకి గురైంది. గురువారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు అధికారులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న శ్రీమందిరం భద్రత అధికారి, సింహద్వారం ఠాణా పోలీసు అధికారి ఘటనా స్థలాన్ని శుక్రవారం సందర్శించి విచారణ చేపట్టారు. ఆలయ దక్షిణద్వారం సమీపంలోని భీముని విగ్రహం కింద అమర్చిన విరాళాల పెట్టెను(హుండీ) దుండగులు తెరిచి, అందులోని సొమ్ము, ఇతర విలువైన సొత్తుని కాజేయడంతో పాటు శ్రీమందిరం లోపలి ప్రాకారం నృసింహ ఆలయం ఆవరణలో ఖాళీ హుండీని విసిరేసినట్లు గుర్తించారు. ఉదయం ఆలయం తలుపులు తెరిచిన అనంతరం ఈ పరిస్థితి సేవాయత్‌ల దృష్టిలో పడింది. అనుబంధ వర్గాలకు విషయం తెలియజేసి, ఖాళీ హుండీని అప్పగించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి, నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ ఘటనతో ఆలయ భద్రత కోసం ఏర్పాటు చేసిన భద్రతా వ్యవస్థ పూర్తిగా డీలా పడిందని సర్వత్రా విచారం వ్యక్తం అవుతోంది. తరచూ ఆలయంలో వీడియో చిత్రీకరణలు, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోవడం దీనికి తార్కాణమని విమర్శిస్తున్నారు. ఇటీవల దక్షిణ ద్వారం సమీపంలోని రామ మందిరం, కొయిలి వైకుంఠం ఆవరణలో సువార్ నియోగుల కార్యాలయంలో చోరీ చోటు చేసుకున్నాయి.

# 4కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన వ్యక్తితో ఎక్సైజ్ సిబ్బంది

జయపురం: జిల్లా ఎక్సైజ్ అధికారి అరుణకుమార్ పాఢి ఆదేశాల మేరకు జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మకు చెందిన సిబ్బంది వివిధ ప్రాంతాల్లో గురువారం రాత్రి పెట్రోలింగ్ చేపట్టారు. అదే సమయంలో బొరిగుమ్మ సమితి బొరగాం మార్గంలో బైక్‌పై అతివేగంగా ప్రయాణిస్తున్న వ్యక్తిని అడ్డుకొని, తనిఖీ చేయగా గంజాయి పట్టుబడినట్లు ఎక్సైజ్ అధికారి బిశ్వజిత్ పాణిగ్రాహి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు 4కిలోల సరుకు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గుజునిగుడ పంచాయతీ ఝొడిగుడ గ్రామానికి చెందిన బలరాం గౌడగా గుర్తించారు. అతనిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచారు.

# అదుపు తప్పిన వాహనాలు



బోల్తా పడిన ఉన్న వాహనం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పోలీస్ స్టేషన్ పరిధి శంకరడ గ్రామం సమీపంలో రెండు వాహనాలు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో నలుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. బాధితులు టికిరి సునాముది వీధికి చెందిన గుప్త సాహు(32), ఎస్‌బిఎస్‌టీ కంపెనీకి చెందిన బి.నాగరాజు(29), సంతోష్ మిశ్రా(36), విశాల్ ఆనంద్(34)గా గుర్తించారు. టికిరిలోని ఇండాల్ కర్మాగారం నుంచి రాయగడకు వస్తున్న బొలేరో, శంకరడ సమీపంలోని మలుపు వద్ద కారు ఎదురెదురుగా రావడంతో తప్పించబోయి రెండు వాహనాలూ బోల్తా పడ్డాయి. దీంతో కారు సమీపంలోని లోయలోకి పడిపోయింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది.. క్షతగాత్రులను ఉషాపాడు లోని ఉత్కళ అలూమిన కర్మాగారం ఆస్పత్రికి తరలించారు.

### ఐఐఐటీ డైరెక్టర్‌గా ఆశిష్ ఘోష్



ప్రొఫెసర్ ఆశిష్ ఘోష్

భువనేశ్వర్: నగరంలోని ప్రఖ్యాత ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐఐఐటీ) డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఆశిష్ ఘోష్ నియమితులయ్యారు. రాష్ట్ర గవర్నర్, ఛాన్సలర్ ప్రొఫెసర్ గణేషీలాల్ నిర్ణయం మేరకు ఈ నియామకం జరిగింది. ఈ పదవిలో ఘోష్ ఐదేళ్ల పాటు నిరవధికంగా కొనసాగుతారు. బాధ్యతలు స్వీకరించిన నుంచి కాల పరిమితి పరిగణిస్తారు. ఇప్పటి వరకు ఆయన కోల్‌కతా ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ప్రొఫెసర్, ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. బోధన రంగంలో సుదీర్ఘంగా 28 ఏళ్ల అనుభవం కలిగి ఉండటంతో పాటు వివిధ అంశాలపై 10 పుస్తకాలను వెలువరించారు. 10మంది పీహెచ్‌డీ అభ్యర్థులకు విజయవంతంగా మార్గనిర్దేశం చేశారు.

### న్యాయవాదికే మస్కా కొట్టిన సైబర్ నేరగాళ్లు



న్యాయవాది వీరేష్ పట్నాయక్

జయపురం: 'సార్.. పర్స్ ఇంట్లో మరచి పోయాను. చికిత్స కోసం డబ్బు అవసరం. ఫోన్ పేలో పంపించగలరు. ఉదయం 11గంటలకు తిరిగి ఇస్తా'నని కొరాపుట్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీరేష్ పట్నాయక్‌కు ఓ సైబర్ నేరగాడి నుంచి ఫోన్ వచ్చింది. పరిచయస్తుని పేరు చెప్పడంతో అతను కూడా వివిధ దఫాలుగా రూ.30 వేలు జమ చేశారు. అయితే కొద్ది సేపటికే ఫోన్ స్విచాఫ్ రావడం, డబ్బు తిరిగి జమ కాకపోవడంతో మోస పోయానని గ్రహించిన న్యాయవాది జయపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై బాధితుడి వివరణ ప్రకారం... మంగళవారం ఉదయం 7750874432నంబర్ నుంచి ఫోను వచ్చింది. తనకు తెలిసిన వ్యక్తి దాస్ బాబుగా పేరు చెప్పి, ఆస్పత్రిలో ఉన్నానని.. చికిత్స కోసం డబ్బులు అవసరం కాగా, పర్స్ మర్చిపోయానని తెలిపాడు. రూ.10 వేలు అవసరం అయ్యాయని, ఇంటికి వచ్చి ఇస్తానని నమ్మబలికాడు. దీంతో అడిగినంత ఫోన్ పే చేశారు. కొద్ది సేపటికే మరో రూ.10 వేలు అడగ్గా, మళ్లీ బదిలీ చేశారు. అనంతరం ఫోన్ చేసి ఫోన్ పేలో రూ.30 వేలు పంపానని నకిలీ రసీదు వాట్సాప్‌కు పంపించాడు. పొరపాటున రూ.10 వేలు అధికంగా జమయ్యాయని, మిగతా మొత్తం ట్రాన్స్‌ఫర్ చేయాలని కోరడంతో తిరిగి జమ చేశారు. అయితే అకౌంట్‌లో చూడగా నగదు లేకపోవడం, సంబంధిత వ్యక్తి ఫోన్ స్విచాఫ్ రావడంతో మోసపోయానని గ్రహించిన అతను.. పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# మురుకివాడల ఉన్నతికి కృషి



శిబిరంలో మాట్లాడుతున్న ఈఓ సిద్ధార్థ పట్నాయక్



శిక్షణకు హాజరైన సభ్యులతో చైర్మన్ నరేంద్ర మహంతి

జయపురం: పట్టణంలోని మురికివాడలను బిజూ ఆదర్శ కాలనీలుగా తీర్చిదిద్దాలని బిజూ ఆదర్శ కాలనీ ప్లానింగ్ బోర్డు రాష్ట్రస్థాయి శిక్షకులు అశుతోష్ దాస్ పిలుపునిచ్చారు. పట్టణంలోని టౌన్ హాలులో మురుగువాడల సంఘ కార్యకర్తల సామర్థ్య శిక్షణా శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బస్తీలో ఇళ్ల నిర్మాణం, తాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రైనేజ్, పారిశుధ్య పనులపై సభ్యులు దృష్టి సారించాలని సూచించారు. మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో మురికివాడల ఉన్నతికి మూడు మున్సిపాలిటీ లను పైలట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంపిక చేసిందని, అందులో జయపురం ఒకటని వెల్లడించారు. ఇది స్థానిక పట్టణ ప్రజలకు దక్కిన గౌరవంగా అభివర్ణించారు. జయపురంలో 43సంఘాలు ఉన్నాయని, వాటిలో 20సంఘాలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పట్టణ సర్వాంగ ఉన్నతికి సంఘాల కార్యకర్తలు చిత్తశుద్ధితో పనిచేయాలని, మున్సిపల్ యంత్రాంగం కూడా పూర్తి సహకారం అందిస్తుందన్నారు. జయపురం మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశ్వినీ పట్నాయక్, క్రిస్టియన్‌పేట సంఘం కార్యకర్త సలామ్ దీపిక శిక్షణ అందించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, కౌన్సిలర్లు, సిబ్బంది, సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్లపై గడువు పెంచాలి

- మున్సిపల్ కార్యవర్గానికి వర్తక సంఘాల వినతి



అధికారులతో ఫోన్లో చర్చిస్తున్న చైర్‌పర్సన్ నిర్మలాశెఠి

పర్లాకిమిడి: అద్దెకు ఉన్న వ్యాపార సంస్థల రిజిస్ట్రేషన్లపై మరో 40 రోజులు గడువు పెంచాలని పర్లాకిమిడి ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ చైర్మన్ పొట్నూరు రామకృష్ణ కోరారు. గత కొన్ని రోజులుగా పర్లాకిమిడి మున్సిపాలిటీ పరిధిలోని చిరు వ్యాపారులు, సంస్థలు, రెడీమేడ్ దుకాణాలపై అధికారులు విస్తృతంగా దాడులు చేపట్టారు. ట్రేడ్ లైసెన్సులు లేనివారిపై జరిమానాలు విధించి, కఠిన చర్యలు తీసుకున్నారు. దీంతో అనేక మంది వ్యాపారులు తమ లావాదేవీలు మూసివేసి, ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ దృష్టికి సమస్యను తీసుకు వెళ్లారు. ఈ మేరకు వర్తక సంఘం ప్రతినిధులు మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ అధికారి వనమాలి శత్పథి, పురపాలక అధ్యక్షురాలు నిర్మలాశెఠితో కౌన్సిల్ హాలులో శుక్రవారం వేర్వేరుగా సమావేశమయ్యారు. అద్దె ప్రదేశాల్లో దుకాణాలు నిర్వహిస్తున్న వారికి ఇంటి పన్ను దరఖాస్తు గడువు కల్పించాలన్నారు. అధికారుల దూకుడుతో వ్యాపారపరంగా నష్టపోతున్నామని వాపోయారు. దీనిపై స్పందించిన చైర్‌పర్సన్.. ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ కోరిన విధంగా ట్రేడ్ లైసెన్సులు మంజూరుకు గడువు ఇస్తామని ప్రకటించారు. దీంతో వ్యాపారులు హర్షం వ్యక్తంచేశారు. సమావేశంలో జిల్లా ట్రేడర్స్, ఛాంబర్ సభ్యులు అంధవరపు బాలాజీ, టంకాల నారాయణ, పొట్నూరు హరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ సభ్యులు

## న్యూస్‌రీల్

### ఆరోగ్యమే మహాభాగ్యం: ఎస్పీ



సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వు మైదానంలో శుక్రవారం ప్రత్యేక పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. పరేడ్ పరిశీలించిన ఆమె, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీసుల నైపుణ్యాలు పరిశీలించి, ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ శాఖలో ప్రతి ఒక్కరికీ ఫిట్‌నెస్ కీలకమని చెప్పారు. పోలీసులు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విఠలేశ్వర్, తిప్పేస్వామి, డీఎస్పీలు శృతి, బాలరాజు, ప్రసాదరావు, ఆర్ఐ ప్రదీప్ పాల్గొన్నారు.

### టెక్కలి సబ్ కలెక్టర్‌కు జేసీగా పదోన్నతి

టెక్కలి: టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని నంద్యాల జేసీగా నియమిస్తూ సీఎస్ కె.ఎస్.జవహర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది అక్టోబర్ 16న టెక్కలి సబ్ కలెక్టర్‌గా రాహుల్‌కుమార్ రెడ్డి విధుల్లోకి చేరారు. సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టుకు సంబంధించి భూముల గుర్తింపు, నిర్వాసితులకు, రైతులకు పరిహారం చెల్లింపు తదితర విషయాల్లో కీలకంగా వ్యవహరించి తనదైన మార్క్ సాధించారు. అంతే కాకుండా టెక్కలి డివిజన్ పరిధిలో ప్రత్యేకంగా స్పందన కార్యక్రమాలు నిర్వహించి పలు సమస్యలను పరిష్కరించారు.

### రైతులు నష్టపోకూడదు



అధికారులు,రైతులతో మాట్లాడుతున్న కృష్ణదాస్

జలుమూరు: వానలు, వంశధార కాలువకు గండి పడడంతో నష్టపోతున్నామని పాగోడు, కూర్మనాథపురం, గొటివాడ, గుగ్గిలి గ్రామాల రైతులు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ముందు వాపోయారు. ఆయన శుక్రవారం నీట మునిగిన పంట పొలాలను వంశధార అధికారులతో కలిసి పరిశీలించారు. రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వంశధార డీఈఈ బాలక శ్రీహరి మాట్లాడుతూ ప్రస్తుతం తాత్కాలికంగా పనులు చేసి రైతులు ఇబ్బందులు తొలగిస్తామన్నారు. శాశ్వత పనులపై కలెక్టర్‌తో మాట్లాడాలని కృష్ణదాస్ సూచించారు. ఆయనతోపాటు ఏఈఈ సురేష్ కుమార్, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, ఎఓ సురేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

### ఖాదీలో యువతకు శిక్షణ ఇవ్వాలి



నేత ప్రక్రియను పరిశీలిస్తున్న విశాఖ చాంబర్ ఆఫ్ కామర్స్ మహిళా విభాగం సభ్యులు

పొందూరు: ఖాదీ బతికి బట్టకట్టాలంటే ఈ పరిశ్రమలోకి యువత రావాలని విశాఖ చాంబర్ ఆఫ్ కామర్స్ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈజీవల్సురాగ్ అన్నారు. ఆమె శుక్రవారం స్థానిక సన్న ఖాదీ కార్మికాభివృద్ధి సంస్థను సందర్శించారు. ఖాదీ, వడుకు నేతల ప్రక్రియలను పరిశీలించారు. పొందూరు సన్నఖాదీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో విశాఖ మహిళా విభాగం వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షురాలు శిరీష, విశాఖ ఆరోహణ గిరిజన కార్యదర్శి సురేఖాపట్నాయక్ పాల్గొన్నారు.

### పొదల్లో గంజాయి బ్యాగులు లభ్యం



గంజాయి స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మెళియాపుట్టి : మండలంలోని ఆంధ్రా ఒడిశా సరిహద్దులో గొప్పిలి గ్రామ పెట్రోల్ బంక్ (కొల్లాని చెరువు గట్టు) పరిసరాల్లోని పొదల్లో మూడు బ్యాగులతో గంజాయి లభ్యమైంది. ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం గొప్పిలి గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు పొదల్లో బ్యాగులు ఉండటం గమనించి వీఆర్వోకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. బ్యాగుల పరిశీలించగా గంజాయి ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు, డీటీ శంకర్ ఆధ్వర్యంలో తూకం వేయగా 16 ప్యాకెట్లలో 33 కేజీలు ఉన్నట్లు తేలింది. దీనిపై స్థానికులను ఆరాతీశారు. గురువారం అర్ధరాత్రి సమయంలో గంజాయి తరలిస్తున్న వ్యక్తులకు పోలీసులు గస్తీ నిర్వహిసున్న సైరన్ వినిపించడంతో పొదల్లో విసిరేసి వెళ్లిపోయి ఉండొచ్చని ఎస్సై రాజేష్ చెబుతున్నారు. ఒడిశాకు చెందిన వారై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. నిందితుల కోసం గాలిస్తున్నామని ఎస్సై తెలిపారు.

# సరిహద్దుల్లో 'ఐ' అలర్ట్

- మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలు ప్రారంభం
- తనిఖీలు ముమ్మరం చేసిన పోలీసు యంత్రాంగం



జయపురం: రాష్ట్ర సరిహద్దులో కూబింగ్ నిర్వహిస్తున్న పోలీసులు



తుమ్మిడిబొంద అటవీ ప్రాంతంలో దర్శనమిచ్చిన పోస్టర్లు



బల్లిగుడ సబ్ డివిజన్‌లో అదనపు సాయుధ బలగాల మోహరింపు



బీఎస్ఎఫ్ జవాన్లతో మాట్లాడుతున్న డీఐజీ, ఎస్పీ

బరంపురం: మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలు శుక్రవారం ప్రారంభమైన నేపథ్యంలో ఒడిశా నుంచి ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మేరకు పోలీసు యంత్రాంగం ఆగస్టు 4వరకు హై అలర్ట్ ప్రకటించింది. కొందమాల్, గంజాం, గజపతి జిల్లాల మధ్య దక్షిణాంచల్ డీఐజీ సత్యబ్రత్ బొయి ఆదేశాలతో కూబింగ్ ముమ్మరం చేశారు. కొందమాల్ జిల్లా ఎస్పీ సుబేందుకుమార్ పాత్రో పర్యవేక్షణలో సాయుధ బలగాలు, సీఆర్‌పీఎఫ్, ఎస్‌ఓజీ జవాన్లను అప్రమత్తం చేశారు. బల్లిగుడా పోలీసు స్టేషన్ పరిధి కటింగియా అటవీ ప్రాంతంలో బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ పోస్టర్లు, బ్యానర్లు దర్శనమిచ్చాయి. మరోవైపు జిల్లా సరిహద్దుల్లో నిఘా ఏర్పాటు చేసి, ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అలాగే ముందు జాగ్రత్త చర్యగా బరంపురం ఓఎస్ ఆర్‌టీసీసీ బస్సులను డిపోలకే పరిమితం చేశారు. దీంతో కొందమాల్, బౌధ్, నయగడా, గజపతి, బలిమెల, మల్కన్‌గిరి, కొరాపుట్ జిల్లాలకు వెళ్లే బస్సులు నిలిచిపోయాయి.

**కూబింగ్ ముమ్మరం..**

జయపురం: సహిద్ వారోత్సవాలతో కొరాపుట్ జిల్లాలో పటిష్ట రక్షణ ఏర్పాటు చేపట్టారు. ఒడిశా-ఆంధ్ర-ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల సరిహద్దులను మూసి వేశారు. సరిహద్దుల్లో బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, డీవీఎఫ్, ఎస్‌ఓజీ, కోబ్రా జవాన్లు పెద్ద ఎత్తున కూబింగ్, సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. అలాగే ప్రభావిత ప్రాంతాల్లో ఆర్‌టీసీ సర్వీసులను రద్దు చేశారు. దీంతో జయపురం-భద్రాచలం, జయపురం-ఫుల్‌బాణి, జయపురం-కొటాగాం, జయపురం-కాశీపూర్, జయపురం-నర్సింగపూర్, జయపురం-పర్లాకిమిడి, జయపురం-మునిగుడ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన నారాయణపట్న, బంధుగాం, దశమంతపూర్, కొతియా ప్రాంతాలకు యథాతథంగా బస్సులు నడుస్తాయని ఓఎస్ ఆర్‌టీసీ వర్గాలు తెలిపాయి. సరిహద్దులో రక్షణ దళాలు పటిష్ట నిఘాతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా దృష్టి సారించారు.

**నిలిచిన బస్సులు..**

రాయగడ: మావోయిస్టు వారోత్సవాల ప్రభావంతో గురువారం సాయంత్రం నుంచి ఆగస్టు 3వరకు జిల్లాలోని పలు మార్గాల్లో బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారోత్సవాల్లో పెద్ద ఎత్తున పాల్గొని, విజయవంతం చేయాలని మావోయిస్టులు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఎటువంటి ఘటనలు ఎదురవ్వకుండా ప్రైవేటు, ప్రభుత్వ బస్సులను రాయగడ టెర్మినల్ వద్ద నిలిపివేశారు. ప్రభావిత ప్రాంతాలైన మునిగుడ, చంద్రపూర్, నారాయణపట్నం, గులుగుడ, సంధుబడి, కల్యాణ సింగుపూర్ ప్రాంతాల్లో సర్వీసులు బస్టాండ్‌కే పరిమితమయ్యాయి.

**నాలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో..**

మల్కన్‌గిరి: జిల్లాలో మావోయిస్టు వారోత్సవాలు ప్రారంభించిన నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా జిల్లా పోలీసు యంత్రాంగం రాష్ట్ర సరిహద్దులను సీజ్ చేసింది. కూబింగ్ ముమ్మరం చేసి, వచ్చి పోయే ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. ప్రధానంగా ఆంధ్ర-ఒడిశా సరిహద్దు చిత్రకొండ సమితికి ఆనుకొని ఉన్న ఎస్ఆర్ కంపెనీ కూడలి, మత్తిలి సమితి క్యేంగ్ తులసీపహడ్, కలిమెల-పొడియా సమితుల మీదుగా వెళ్లే ఛత్తీస్‌గఢ్ రహదారి, మోటు వద్ద తెలంగాణ రహదారులను మూసి వేశారు. బీఎస్ఎఫ్, డీఆర్‌జీ, జిల్లా పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని జిల్లా ఎస్పీ నితీష్ వాధ్వనీ తెలిపారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ బస్సులు జిల్లా కేంద్రానికే పరిమితం కాగా, ప్రైవేటు బస్సులు యథాతథంగా రాకపోకలు సాగిస్తున్నాయి.



రాయగడ: బస్టాండ్‌లో నిలిచిన ప్రైవేటు, ఓఎస్ఆర్‌టీసీ బస్సులు

## ఇంటిలిజెన్స్ సెల్ ప్రారంభం..

మల్కన్‌గిరి: జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియాలోని పెప్పరమెట్ల, బలిమెల పోలీసు స్టేషన్ పరిధిలో ఇంటిలిజెన్స్ సెల్‌ను కొరాపుట్ డీఐజీ చరణ్‌సింగ్ మినా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు మావోయిస్టులకు కోటలా ఉన్న పెప్పరమెట్లలో నిత్యం ఏదో ఒక అలజడి రేగేదని తెలిపారు. బీఎస్ఎఫ్ ప్రవేశం అనంతరం జిల్లా పోలీసులతో కలిసి చేపట్టిన సంయుక్త కూబింగ్‌తో ఈ చర్యలకు అడ్డుకట్ట వేశామన్నారు. స్థానిక గిరిజనులకు ఏ సాయం కావాలన్నా అందించేందు పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉందని ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్పీ నితీష్ వాధ్వనీ, పోలీసు ఉన్నతాధికారులు, పెప్పరమెట్ల బీఎస్ఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.



ఇంటిలిజెన్స్ సెల్‌ను ప్రారంభిస్తున్న డీఐజీ చరణ్‌సింగ్ మినా

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ స్మృతిరంజన్

పర్లాకిమిడి: గజపతి జిల్లా కేంద్రం పర్లాకిమిడి స్టేడియంలో జరగనున్న 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ సూచించారు. ఈ మేరకు జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో సన్నాహక, సమీక్ష సమావేశం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ అలోక్‌కుమార్ ప్రధాన్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీకాంత్ సామల్, ఆర్టీఓ, రెవెన్యూ, మెడికల్, స్టేట్‌బ్యాంకు అధికారులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులకు జిల్లావ్యాప్తంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని తెలిపారు. అలాగే గజపతి స్టేడియంలో పతాక ఆవిష్కరణ కార్యక్రమానికి అవసరమైన బారికేడ్లు, తాగునీరు, ఇతర ఏర్పాట్లను రోడ్లు-భవనాల శాఖ నిర్వహించాలని ఆదేశించారు.

## ఈ-శ్రమ్ కార్డుతో భవితకు భరోసా

రణస్థలం: అసంఘటిత రంగంలో పనిచేసే వారికి ఈ-శ్రమ్ కార్డు భరోసా ఇస్తుందని శ్రీకాకుళం అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్ ఆర్.వి.శ్రీనివాసరావు అన్నారు. రణస్థలంలోని పలు దుకాణాల్లో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులకు శుక్రవారం ఈ-శ్రమ్ కార్డులను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ అసంఘటిత రంగంలో పనిచేసే వారికి ఎలాంటి ఈపీఎఫ్, ఈఎస్ఐ ఉండదని, అలాంటి వారికి ఆర్థిక, సామాజిక భద్రత అందించడా నికి కేంద్ర ప్రభుత్వం 2021లో ఈ శ్రమ్ కార్డును తీసుకువచ్చిందని చెప్పారు. ఇందులో నమోదైన వారికి రూ. 2లక్షల జీవిత బీమా, లక్ష ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు.

## 'మణిపూర్' నిందితులను కఠినంగా శిక్షించాలి

- దళిత సంఘాలు, కాంగ్రెస్ పార్టీ నాయకుల డిమాండ్



మెయిన్ రోడ్డుపై దళిత సంఘాల నిరసన ర్యాలీ

రాయగడ: సభ్య సమాజం తల దించుకునేలా మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై జరిగిన అత్యాచారం, అన్యాయ ఘటనలపై కేంద్రప్రభుత్వం సమాధానం చెప్పాలని దళిత సంఘాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. దీనికి సంబంధించిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ మేరకు పట్టణంలోని డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి శుక్రవారం ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకొని, కార్యాలయం ఎదుట నిరసన తెలిపాయి. ఆదివాసీలపై రోజురోజుకు అకృత్యాలు పెరిగిపోతున్నాయని, దీనిని అదుపు చేయకపోతే దళిత సంఘాలు ఏకమై దేశవ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు. మహిళలు, చిన్నారులు ప్రాణభయంతో ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నా స్పందించక పోవడంపై కేంద్రం వైఖరిని ఎండగట్టారు. అనంతరం రాష్ట్రపతి పేరిట వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ ధర్మానంద బెహరాకు అందించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు గంగాధర్ పువ్వల, హరప్రసాద్ హెప్రుక, శంకర్ గరడ తదితరులు పాల్గొన్నారు. అలాగే మణిపూర్ ఘటనలో కేంద్రప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని డీసీసీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ గమాంగొ విమర్శించారు. ఈ మేరకు పట్టణంలో భారీ ర్యాలీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏడీఎం ధర్మేంద్ర ప్రధాన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆదివాసీ మహాసంఘం జిల్లా అధ్యక్షుడు అప్పలస్వామి కద్రక, కాంగ్రెస్ కమిటీ పట్టణ అధ్యక్షుడు మజ్జి శంకరరావు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు అంబికా మాఝి తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## క్రైమ్ కార్నర్

### గెడ్డలో యువకుడు గల్లంతు



లోకేష్(ఫైల్)

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం పంచాయతీ దేవునిపాలస వద్ద చిట్టిగెడ్డలో దేబారి లోకేష్(14) అనే యువకుడు గల్లంతయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం పినతరిమి గ్రామానికి చెందిన దేబారి లోకేష్ బొప్పడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సెలవు కావడంతో బొప్పడాం సమీపంలోని వల్లూరులో క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. అక్కడి నుంచి దేవునిపాలవలసలో స్నేహితుల ఇంటికి వెళ్లాడు. దేవునిపాలవలస కనిమెల్ల గ్రామాల మధ్య చిట్టిగెడ్డలో స్నానం చేసేందుకు ఉదయం 11.30 గంటలకు దిగి గల్లంతయ్యాడు. స్నేహితులు గెడ్డలో గాలించిన లోకేష్ ఆచూకీ తెలియలేదు. తండ్రి దేబారి మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రైలు నుంచి జారిపడి మహిళ మృతి

కోటబొమ్మాళి: మండలంలోని యలమంచిలి పంచాయతీ గురువెల్లిపేట సమీపంలో సాగునీటి కల్వర్టులో శుక్రవారం సాయంత్రం రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి పశ్చిమబెంగాల్‌కు చెందిన గుర్తు తెలియని మహిళ మృతిచెందినట్లు పలాస రైల్వే ఎస్ఐ షరీఫ్ తెలిపారు. మృతురాలి వయసు 30 ఏళ్లు ఉంటుందని, హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్న గుర్తింపు కార్డు ఆధారంగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన మహిళగా గుర్తించామని పేర్కొన్నారు. రైల్వేపోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత మృతి

టెక్కలి: ఈ నెల 24న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన టెక్కలి మండలం చిన్నరోకళ్లపల్లికి చెందిన తామరాపల్లి రమాకుమారి(24) శుక్రవారం విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. టెక్కలి ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. రామాకుమారి భర్త గిరి కొంత కాలంగా దుబాయ్‌లో ఉంటూ ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో మరోసారి దుబాయ్ వెళ్లేందుకు నిర్ణయించుకున్నాడు. అది ఇష్టం లేక భార్య రమాదేవి భర్తతో గొడవకు దిగింది. ఈ క్రమంలో ఈ నెల 24న ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగింది. భర్త కూడా గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.



సాగునీటి కల్వర్టులో మృతదేహం

కుటుంబ సభ్యులు ఇరువురిని టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం తరలించగా మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ రమాదేవి మృతి చెందారు. తల్లి దమయంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. తహసీల్దారు ప్రవల్లికప్రియ సమక్షంలో శవ పంచనామా చేశారు.

### పాముకాటుతో మహిళ మృతి



దున్న తులసమ్మ

సోంపేట: మండలంలోని మామిడిపల్లి పంచాయతీ గణేష్ సెంటర్‌కు చెందిన దున్న తులసమ్మ (40) శుక్రవారం పాముకాటుతో మృతి చెందింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిర వివరాలు ఇలా ఉన్నాయి. తులసమ్మ రోజూ పొలాల్లోని గోంగూర కోసి ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముతుంటారు. శుక్రవారం ఉదయం కూడా పొలానికి వెళ్లి గోంగూర కోశారు. పొలంలో ఏదో కాటు వేసినట్లు అనిపించినా ఆమె పట్టించుకోలేదు. గ్రామం నుంచి బయల్దేరి బస్సులో పలాస మండలం అక్కుపల్లి గ్రామం చేరుకుంది. బస్సు దిగిన వెంటనే తీవ్ర అస్వస్థతకు గురై స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే స్థానికులు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి, అక్కడినుంచి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పాముకాటుగా గుర్తించి చికిత్స అందించినా పరిస్థితి విషమించింది. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందారు. ఈమె భర్త గిరి బాబు పదేళ్ల కిందట క్యాన్సర్‌తో మృతి చెందారు. వీరికి వందన, ఝాన్సీ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోంపేట ఆస్పత్రిలో శవ పంచనామా నిర్వహించారు. బారువ పోలీసులు కేసు నమోదు చేశారు.

### ఆదివాసీలపై దాడులు అరికట్టాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న మారణహోమంపై రాష్ట్రపతి మౌనం వీడాలని, రాష్ట్రంలో శాంతి నెలకొల్పే ప్రయ త్నాలు చేయాలని, సీఎంను బర్తరఫ్ చేయాలని దళిత, ఆదివాసీ, మైనార్టీ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శుక్రవారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నల్లి ధర్మారావు, అట్టాడ అప్పలనాయు డు, సన్నశెట్టి రాజశేఖర్, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రాంగోపాల్, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్, కులనిర్మూలాన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, పిట్ట చంద్రపతిరావు, షా, ఎజ్రా, కల్లేపల్లి రాంగోపాల్, పోతల దుర్గారావు, శ్యాం, బెలమర ప్రభాకర్, రాకోటి రాంబాబు, తాండ్ర ప్రకాష్, కృష్ణవేణి, నేతల అప్పారావు, బోను మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### త్రుటిలో తప్పిన పెనుప్రమాదం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

**భోగాపురం:** భోగాపురం సమీపంలోని సుందరపేట జాతీయ రహదారి వంతెనపై శుక్రవారం శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న కారు ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. అయితే అదృష్టవశాత్తు కారులోని బెలూన్ ఓపెన్ కావడంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ సంఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

### మహిళ అదృశ్యంపై కేసు నమోదు

**వీరఘట్టం:** మండలంలోని పనసనందివాడ గ్రామానికి యువతి అదృశ్యమైనట్లు ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.వి.రమణ శుక్రవారం తెలిపారు.ఈనెల 25న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె మూడు రోజులైనా తిరిగి రాకపోవడంతో చుట్టాలు, బంధువులు ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు.

**జియ్యమ్మవలసలో మరో యువతి**

**జియ్యమ్మవలస:** మండలంలోని ఇటిక గ్రామానికి చెందిన యువతి (19) ఈనెల 25వ తేదీనుంచి కనబడుడం లేదంటూ కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.అనీష్ తెలిపారు.ఆచూకీ తెలిసిన వారు 9121109479, 8519843858 నంబర్లకు తెలియపరచాలని కోరారు.

### పవన్ ఫ్యాన్స్ అత్యుత్సాహం



పవన్ ఫ్యాన్స్ వల్ల చిరిగిపోయిన థియేటర్ స్క్రీన్

**పార్వతీపురంటౌన్:** పట్టణంలోని సౌందర్య థియేటర్లో 'బ్రో' సినిమా రిలీజ్ సందర్భంగా పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ అత్యుత్సాహంతో స్క్రీన్ చింపివేశారు. సినిమా శుక్రవారం విడుదలైన సందర్భంగా వెళ్లిన అభిమానులు చిత్రంలో పవన్ కల్యాణ్ ఎంట్రీ సమయంలో స్క్రీన్ దగ్గరకెళ్లి సందడి చేశారు. ఈ తరుణంలో తోపులాట జరిగి స్క్రీన్ చిరిగిపోయింది. రూ.1.10 లక్షల విలువ గల స్క్రీన్ పాడవడంతో థియేటర్ యాజమాన్యం పోలీసులను సంప్రదించింది. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

### నకిలీ పోలీస్ అరెస్ట్

**విజయనగరం క్రైమ్:** తాను పోలీస్‌నని నమ్మించి ఓ ఆటోడ్రైవర్ నుంచి సెల్‌ఫోన్, రూ.500 తీసుకుని పరారైన నిందితుడిని వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖలోని గోపాలపట్నానికి చెందిన గోపిశెట్టి మనోజ్ కుమార్ పోలీస్‌నని నమ్మించి నెల్లిమర్ల మండలం బొప్పడాం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ నేతేటి శ్రీను దగ్గర నుంచి సెల్‌ఫోన్, రూ.500 నగదు పట్టుకుని పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిందితుడు మనోజ్‌కుమార్‌ను అరెస్టు చేసి, సెల్‌ఫోన్ రికవరీ చేసి, రిమాండ్‌కు తరలించారు.

### గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**శృంగవరపుకోట:** మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ రాజుల కళ్లాలకు చెందిన కలిదిండి రామరాజు(51) గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్.కోట ఎస్సై తారకేశ్వరరావు శుక్రవారం చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. మద్యానికి అలవాటు పడిన రామరాజును కుటుంబసభ్యులు మందలించడంతో మనస్తాపం చెంది గురువారం మధ్యాహ్నం గడ్డిమందు తాగేశాడు. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు ఏస్సై వెంకటరమణ కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

### గండి పూడ్చివేత



గండిని పూడ్చిన ప్రదేశం

**బొబ్బిలి:** మండలంలోని అలజంగి వద్ద తోటపల్లి కుడి ప్రధాన కాలువకు పడిన గండిని జలవనరుల శాఖ డీఈఈ డీఎస్ఎస్ కుమార్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం జేసీబీతో పూడ్చివేయించారు. నీటి సరఫరాను యథావిధిగా కాలువ గుండా విడిచిపెట్టారు. రైతుల విజ్ఞప్తి మేరకు తోటపల్లి కాలువకు, ఎస్సీ కాలనీకి మధ్య ఉన్న పెద్ద మొక్కలతో నిండి ఉన్న కాలువలో పూడికతీత పనులు చేపట్టారు. గట్టు పటిష్టత పనులు శనివారం చేపడతామని డీఈఈ తెలిపారు.

# ఓటర్ల సర్వే జాప్యంపై కలెక్టర్ ఆగ్రహం



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి ఎస్



పాల్గొన్న వివిధ మండల స్థాయి అధికారులు

**విజయనగరం అర్బన్:** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలో చేపట్టిన సర్వే నెమ్మదిగా సాగుతుండడంపై కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మందకొడిగా సర్వే జరుగుతున్న మండలాల అధికారులపై మండిపడ్డారు. పనితీరు మార్చుకుని సర్వే వేగవంతం చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై శుక్రవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, ఎన్నికల డీటీలతో సమీక్షించారు. నియోజకవర్గాల వారీగా చేపట్టిన మండలాల ఓటరు జాబితా సవరణ ప్రక్రియను తెలుసుకున్నారు. ఇంటింటి సర్వే ప్రారంభమై దాదాపు వారం రోజులు కావస్తున్నా కనీసం పదిశాతం కూడా పూర్తి కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో సుమారు 5,17,000 ఇళ్లు ఉండగా ఇప్పటి వరకు కేవలం 38 వేల ఇళ్ల సర్వే మాత్రమే పూర్తి చేయడం పట్ల అసంతృప్తి వెలిబుచ్చారు. ఇలా అయితే శతశాతం ఎప్పుడు పూర్తవుతుందని ప్రశ్నించారు.

**వచ్చేవారానికి 50 శాతం పూర్తికావాలి**

కొత్త ఓటర్లు, జనవరి 2024 నాటికి ఓటుహక్కు పొందనున్న వారి వివరాలు కూడా చాలా తక్కువగా సేకరించారన్నారు. డెత్ ఓటర్స్ వెరిఫికేషన్, వందేళ్లపైబడిన ఓటర్ల వివరాల తనిఖీ కూడా అంతంతమాత్రంగానే ఉందన్నారు. సర్వేలో 6, 7, 8 ఫారాల స్వీకరణ పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పనితీరు మారాలని నిర్లిప్తతను విడనాడాలని సూచించారు. వచ్చే వారం చివరి నాటికి 50 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. సవరణ ప్రక్రియపై తహసీల్దార్లు, ఆర్‌డీఓలు ప్రతిరోజూ బీఎల్‌ఓలతో సమీక్ష చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఈఆర్‌ఓలు, జిల్లా ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నియంత్రణే ధ్యేయం

● కలెక్టర్ నిషాంత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

**పార్వతీపురం:** మాదక ద్రవ్యాల నియంత్రణే ధ్యేయం కావాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులకు స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల నియంత్రణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణకు అవగాహన ప్రధానమని అభిప్రాయ పడ్డారు. పాఠశాలలు, కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్, కృషి విజ్ఞాన కేంద్రం తదితర అన్ని విద్యా సంస్థలలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యాసంస్థలలో ఉదయం జరిగే అసెంబ్లీ సమయంలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాల పట్ల ఐదు నిమిషాలు విద్యార్థులకు విధిగా తెలియజేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో 9, 10 తరగతుల విద్యార్థులు విధిగా భాగస్వామ్యం కావాలని ఆదేశించారు. జిల్లాలో డీ అడిక్షన్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి. జగన్నాథ రావును ఆదేశించారు. అటవీప్రాంతంలో గంజాయి తదితర మాదక ద్రవ్యాల పంటలు పండించకుండా నిఘా ఉంచాలని జిల్లా అటవీ అధికారి జీఏపీ ప్రసూనను ఆదేశించారు. పోలీస్, అటవీశాఖ సంయుక్తంగా చెక్ పోస్టులవద్ద తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

**ఎస్ఈబీ ఆధ్వర్యంలో అవగాహన**

సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణపై ఎస్ఈబీ పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. జిల్లాలో మాదక ద్రవ్యాల ప్రభావం ప్రస్తుతం లేదని, యువతను సన్మార్గంలో నడిపించడానికి అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు. విద్యాసంస్థల సమీపంలో మాదక ద్రవ్యాల విక్రయం, వినియోగం వంటి అంశాలుంటే సమాచారం అందించాలని కోరారు. విద్యాసంస్థల దగ్గర టోల్ ఫ్రీ నంబర్, ఇతర సమాచారంతో బోర్డులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు తగిన అవగాహన కల్పించి ప్రయాణికుల్లో అనుమానితులుంటే సమాచారం అందించే విధంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. జిల్లా అటవీ అధికారి జీఏపీ ప్రసూన మాట్లాడుతూ జిల్లాలో 74 బీట్లు ఉన్నాయని, తమ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నారని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు, అదనపు ఎస్పీ డా. ఒ.దిలీప్‌కిరణ్, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఏఎస్పీ సునీల్ షరోన్, పాలకొండ డీఎస్పీ జీఈ కృష్ణారావు, జిల్లా ప్రధాన అగ్నిమాపక అధికారి కె. శ్రీనుబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి ఎం.డి.గయజుద్దీన్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.దేవుళ్ల నాయక్, కమిటీ సభ్యులు జి.చంద్రయ్య, డి. శ్రీనివాసరావు, వేణుగోపాలరావు, జి.తిరుపతిరావు, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ, విద్యాశాఖ ఎ.డి ఎం.రమాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## గెడ్డలో విద్యార్థి గల్లంతు

● గజ ఈతగాళ్లు గాలించినా దొరకని ఆచూకీ
● కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు



చిట్టగెడ్డలో గాలింపు చర్యలు చేపడుతున్న గజ ఈతగాళ్లు



గల్లంతైన లోకేష్

**నెల్లిమర్ల రూరల్:** మండలంలోని పినతరిమి గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలోని దేవునిపాలవలసలో గల గెడ్డలో శుక్రవారం గల్లంతయ్యాడు. ఈ ఘటనపై కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పినతరిమి గ్రామానికి చెందిన దేబార్కి మహేష్, రాజేశ్వరి దంపతుల కుమారుడు లోకేష్(14) బొప్పడాం ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సెలవులు రావడంతో సమీప వల్లూరు గ్రామానికి క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. ఆట ముగిసిన తరువాత..ఆ గ్రామం సమీపంలో గల రణస్థలం మండల పరిధి దేవునిపాలవలసలోని చిట్టగెడ్డకు ఎనిమిది మంది స్నేహితులతో కలిసి ఈత కోసం వెళ్లాడు. అందరూ గెడ్డలో స్నానానికి దిగగా..నీటి ఉధృతికి లోకేష్ గల్లంతయ్యాడు. రక్షించేందుకు స్నేహితులు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ విషయం తెలుసుకున్న గజఈతగాళ్లు, ఆ గ్రామస్తులు గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. చీకటి పడడంతో గాలింపు నిలిపివేశారు. లోకేష్ ఊబిలో కూరుకుపోయి ఉంటాడని స్థానికులు చెబుతున్నారు. కాగా లోకేష్ చదువులో చురుగ్గా ఉండడమే కాకుండా ఇటీవల పాఠశాలలో జరిగిన జరిగిన ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సాధించి అడిషనల్ ఎస్పీఎల్‌గా ఎన్నికయ్యాడు. తమ కుమారుడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లిదండ్రులతో పాటు కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

### నేడు సీతం కళాశాలలో ఉద్యోగ నియామకాలు

**విజయనగరం అర్బన్:** నగరంలోని గాజులరేగ పరిధి సీతం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఉద్యోగ నియామకాలు జరగనున్నాయని కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణ్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్మమ్మినా, డబ్ల్యూఎస్ఎస్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీలు ఉద్యోగ నియామకాలు కల్పిస్తాయని, ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన విద్యార్థులు హాజరుకావచ్చని సూచించారు. ఈ నియామకాలు శనివారం ఉదయం 10 గంటల నుంచి నుంచి సాయంత్రం వరకు జరగనున్నాయని, పూర్తి వివరాల కోసం ఫోన్ 9494906561, 7981444642 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### వైభవంగా సహస్ర దీపాలంకరణ



దీప కాంతుల శోభలో స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

**నెల్లిమర్ల రూరల్:** పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని అర్చకులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం అనంతరం తాత్కాలిక యాగశాలలో విశేష హోమం జరిపించారు. తరువాత స్వామి వెండి మంటపం వద్ద నిత్య కల్యాణ వేడుకను కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగింపుగా తీసుకువెళ్లి సహస్ర దీపారాధన మంటపంపై ఉన్న ప్రత్యేక పల్లకిలో వేంజేపు చేసి సహస్ర దీపాలను వెలిగించి స్వామికి ఊంజల్ సేవ చేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

### 120 లీటర్ల సారా పట్టివేత

**సీతంపేట:** మండలంలోని వలగజ్జి గ్రామంలో 120 లీటర్ల సారా పట్టుకున్నట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు. రెండు ద్విచక్ర వాహనాలతో ఇద్దరు వ్యక్తులు సారా తరలిస్తుండగా వెంబడించామని, దీంతో వాహనాలతో పాటు సారా గ్రామ సమీపంలో వదిలి పారిపోయారన్నారు. అలాగే మర్రిగూడలో బి.మోహనరావు అనే వ్యక్తి 15లీటర్లు సారాతో పట్టుబడ్డాడని తెలిపారు. ఈ మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

## కొత్తవలస ఎంఈఓపై చర్యలకు డిమాండ్



మధురవాడ ఆర్‌జేడీ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న యూటీఎఫ్ విజయనగరం శాఖ నాయకులు

**మధురవాడ:** ఉపాధ్యాయులను వేధిస్తున్న విజయనగరం జిల్లా కొత్తవలస మండల విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని ఆ జిల్లా యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మధురవాడలోని విశాఖపట్నం జోన్ విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యాలయంలో ఓ ఉపాధ్యాయుడు సర్వీసు రిజిస్టర్ పోయిందని, ఎస్ఆర్‌ని సదరు ఉపాధ్యాయుడు తీసుకున్నట్టు ఫోర్జరీ సంతకం చేయించడం, మూడేళ్లు ఇంక్రిమెంట్‌లు నిలిపివేయడం వంటి తప్పుడు చర్యలకు పాల్పడిన ఎంఈఓపై తాము ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అయినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఏడీ శ్రీరామమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఎంఈఓకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ధర్నాలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, విజయనగరం, అనకాపల్లి, విశాఖ జిల్లాల ప్రధాన కార్యదర్శులు జేఏవీఆర్‌కే ఈశ్వరరావు, జి.చిన్నబ్బాయి, ఆర్.అంబేడ్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి, డి.రాము, నాయకులు అప్పారావు, కె.ప్రసాదరావు, పి.త్రినాథ్, పి.వాసుదేవరావు పాల్గొన్నారు.

## సృజనాత్మక ప్రాజెక్టులు నమోదు చేయండి



సదస్సులో మాట్లాడుతున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

**విజయనగరం ఫూల్‌బాగ్:** ఇన్‌స్పైర్ మానక్ వెబ్‌సైట్‌లో సృజనాత్మక ప్రాజెక్టులు అధికంగా నమోదు చేయాలని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి సూచించారు. ఈ మేరకు స్థానిక కంటోన్మెంట్‌లోని గురజాడ స్కూల్‌లో విజయనగరం డివిజన్ సైన్స్ ఉపాధ్యాయులకు శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ కె వాసుదేవరావు, జిల్లా సైన్స్ అధికారి మిరియాల కృష్ణారావు, టి. రాజేష్, వి.సత్యారావు, వేణుగోపాలరావు, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా ఆటగాళ్ల 'ఎత్తులు'



ఉత్కంఠ భరితంగా జరుగుతున్న చెస్ పోటీలు

**విజయనగరం:** విజయనగరం జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ టీం ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్ షిప్ పోటీలు శుక్రవారం టీటీడీ కల్యాణ మంటపంలో హోరాహోరీగా కొనసాగాయి. రెండవ రోజు పోటీలను ఇన్‌స్పైర్ స్కూల్ ప్రిన్సిపాల్ రవి, డాక్టర్ బీసెంట్ స్కూల్ డైరెక్టర్ వింధ్య లాంఛనంగా ప్రారంభించారు. హోరాహోరీగా జరుగుతున్న ఈ పోటీల్లో విశాఖపట్టణం నుంచి అఖిల్ ప్రసాద్ వెంకట రుత్విక్, కృష్ణ జిల్లా నుంచి కొల్ల భవన్ తూర్పు గోదావరి జిల్లా నుంచి భాస్కర్ రత్న షణ్ముఖ రెడ్డిలు మంచి ఎత్తులు వేసి ముందంజలో కొనసాగుతున్నారు. ఈ పోటీలు మరో రెండు రోజులపాటు జరగనున్నాయి. సీనియర్ క్రీడాకారులకు వర్ధమాన క్రీడాకారులు గట్టి పోటీ ఇవ్వడంతో పోటీలు రసవత్తరంగా మారాయి. ఈ పోటీలను రాష్ట్ర కార్యదర్శి సనపల భీమారావు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మస్తాన్ బాబు రాష్ట్ర కోశాధికారి జ్వాలాముఖి పర్యవేక్షిస్తున్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఇంటర్నేషనల్ ఆర్బిటర్ జీవీ కుమార్ వ్యవహరిస్తున్నారు.

## కొత్త ఏఐ సెంటర్‌లకు దరఖాస్తుల ఆహ్వానం



సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఈఓ ఎస్.ప్రేమ్ కుమార్

**పార్వతీపురంటౌన్:** సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఏఐ సెంటర్‌లకు కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. జిల్లా ఓపెన్ స్కూల్ సమన్వయకర్త సీహెచ్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఒకరోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఓపెన్ స్కూల్ ద్వారా పొందిన ఉత్తీర్ణత సర్టిఫికెట్లు అందించామన్నారు. కొత్త ఏఐ సెంటర్లు కావలసిన వారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో గల అన్ని ఏఐ సెంటర్‌లలో తరగతులు క్రమమైన పద్ధతిలో జరగాలని, ఓపెన్ స్కూల్స్‌లో రాష్ట్రం విధించిన అడ్మిషన్‌ల లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. బడి ఈడు గల పిల్లలందరినీ బడిలో చేర్పించాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం 6నుంచి 14 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలందరినీ వయసుకు తగిన తరగతిలో బడిలో చేర్పించే బాధ్యతను మనమందరం తీసుకోవాలని తెలియజేశారు. గత సంవత్సరాలలో ఫెయిల్ అయిన అభ్యర్థులందరూ ఏఐ సెంటర్‌లను సంప్రదించి ఓపెన్ స్కూల్‌లో చేరాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐ సమన్వయకర్తలు, సెక్టోరల్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ఓపెన్ స్కూల్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పాల్గొన్నారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి



నాగరాజు (ఫైల్)

**కొత్తవలస:** మండలంలోని కంటకాపల్లి గ్రామం సమీపంలో గల చెరువులో పడి ఆదే గ్రామానికి చెందిన ఉల్లి నాగరాజు(43) మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుడి కుటుంబసభ్యులు, ఎస్సై సీహెచ్.హేమంత్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగరాజు కిరాణా సామగ్రి కొనేందుకు బుధవారం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. తిరిగి ఎంతకీ రాకపోవడంతో చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇంటి వద్ద వెతికినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. కాగా గ్రామ సమీపంలో గల చెరువు వద్ద మృతుడి చెప్పులు, గొడుగు ఉండడాన్ని గ్రామస్తులు గురువారం గమనించారు. శుక్రవారం ఉదయం నాగరాజు మృతదేహం చెరువులో తేలింది. దీంతో మృతుడి భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు కాగా ఒకరికి పెళ్లయింది. మరో అమ్మాయి 10వ తరగతి చదువుతోంది. ట్రాక్టర్ డ్రైవర్‌గా నాగరాజు పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు.

### ఆదుకున్న ట్రాఫిక్ పోలీస్

**విజయనగరం క్రైమ్:** విజయనగరం ఎత్తుబ్రిడ్జి సమీపంలో శ్రీకాళం జిల్లా ధనుకువాడకు చెందిన జయరామ్ శుక్రవారం మధ్యాహ్నం లారీ నుంచి కిందకు దిగి కుప్పకూలిపోయాడు. అక్కడ ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పి.సురేష్ వెంటనే అతని వద్దకు వెళ్లి తాగునీటిని అందించాడు. అతనికి పెరాలసిస్‌తో చేయి రాకపోవడంతో కానిస్టేబులే స్వయంగా ఆహారం తినిపించి ఉదారతను చాటుకున్నాడు. అనంతరం 108కి సమాచారమిచ్చి ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. మానవత్వం చూపిన కానిస్టేబుల్‌ను పలువురు మెచ్చుకున్నారు.



పక్షవాతంతో ఇబ్బందిపడిన జయరామ్‌కు ఆహారం తినిపిస్తున్న కానిస్టేబుల్ సురేష్

# ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన

● విజేతలకు బహుమతులు అందజేసిన పశుసంవర్థక శాఖ ఎ.డి



తెర్లాం: లేగదూడల ప్రదర్శనలో మొదటి బహుమతిని రైతుకు అందజేస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారులు, సర్పంచ్



సీతానగరం: మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి

**తెర్లాం:** జాతీయ పశు కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా తెర్లాం మండలంలోని పణుకువలస పంచాయతీ సోమిదవలస గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన లేగదూడల మండల స్థాయి ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి తెర్లాం పశువైద్య కేంద్రం పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఎ.డి)డాక్టర్ నాగరాజు, జిల్లా లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ అధికారి డాక్టర్ శ్రీలక్ష్మి, మండల పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్, నెమలాం పశువైద్య కేంద్రం డాక్టర్ అరుణ, గ్రామ సర్పంచ్ చందక సత్యనారాయణ హాజరయ్యారు. లేగదూడల ప్రదర్శనకు మండలంలోని పలు గ్రామాల నుంచి 45 లేగదూడలను పాడి రైతులు తీసుకువచ్చారు. వాటిలో మూడు లేగదూడలను మొదటి మూడు స్థానాలకు ఎంపిక చేసి ఆయా లేగదూడల రైతులకు బహుమతులను అందజేశారు. అలాగే ప్రదర్శనలో పాల్గొన్న ప్రతి లేగదూడకు సంబంధించి ఆ రైతుకు ప్రత్యేక బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తెర్లాం పశువైద్య కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు మాట్లాడుతూ పాడిరైతులను ప్రోత్సహించేందుకు, మేలుజాతి పశు సంపదను తయారు చేయాలనే ఉద్దేశంతోనే సోమిదవలసలో లేగదూడల ప్రదర్శనను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా లైవ్‌స్టాక్ డిపార్ట్‌మెంట్ ఏజెన్సీ అధికారి డాక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ పశువులకు గర్భధారణ, మేలుజాతి పశుసంపద తయా రు చేయడంపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలు గ్రామ సచివాలయాల వీహెచ్ఏలు పాల్గొన్నారు.

**లేగ దూడల ఆరోగ్య పరిరక్షణ అవసరం**

**సీతానగరం:** రైతులు కృత్రిమ గర్భోత్పత్తికి, లేగ దూడల ఆరోగ్య పరిక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పార్వతీపురం మన్యం జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ బి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని నిడగల్లు పశువైద్య కేంద్రం ఆవరణలో జిల్లా డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ దామోదరరావు ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం మండల పశువైద్యాధికారి ఎస్.రామారావు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు దూడల ఆరోగ్య పరిరక్షణకు, సమతుల్యమైన ఆహారం అందించడం,సంరక్షణ, పశువైద్యుల సూచనలు సలహాలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దూడలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే వాటి సంతతి బాగుంటుందన్నారు. అనంతరం లేగదూడల ప్రదర్శనలో ఆరోగ్యవంతంగా ఉన్న దూడల రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బొబ్బిలి డీడీ నీలయ్య, సీతానగరం, పార్వతీపురం ఏడీహెచ్ఏలు డాక్టర్ సీహెచ్‌దీనకుమార్, ప్రసాదరావు, పశువైద్యాధికారులు చక్రధర్, సంజీవిరావు, చంద్రశేఖర్, ఏహెచ్ఏలు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

## సమస్యలు సృష్టించేవారిపై నిఘా



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

**విజయనగరం క్రైమ్:** పల్లెలు, పట్టణాల్లో సమస్యలు సృష్టించే వ్యక్తులపై నిఘా ఉంచాలని, వారిని ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌ల వద్ద హాజరుపర్చి సత్ప్రవర్తన కోసం బైండోవర్ చేయాలని ఎస్పీ ఎం.దీపిక పోలీస్ అధికారులకు సూచించారు. అవసరమైతే వారి నుంచి సెక్యూరిటీ బాండ్‌లు తీసుకోవాలన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలీస్ అధికారులు, సిబ్బంది విస్తృతంగా గ్రామ సందర్శనలు చేసి, క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, వార్డుల్లో ప్రస్తుతమున్న పరిస్థితుల ఆధారంగా సమస్యాత్మక, తీవ్ర సమస్యాత్మక, సాధారణ గ్రామాలు, వార్డులు వివరాలు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. మద్యం అమ్మకాలు, పేకాట శిబిరాలపై దాడులు చేయాలన్నారు. వివిధ పోలీస్ స్టేషన్‌లలో నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్, కొట్లాటలు, హత్యాయత్నం కేసులను సమీక్షించారు. సమావేశంలో ఏఎస్పీ అస్మా ఫర్హీన్, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, చీపురుపల్లి డీఎస్పీ ఎ.ఎస్.చక్రవర్తి, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్, ఎస్సీ, ఎస్టీసెల్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, న్యాయసలహాదారులు వై.పరశురాం పాల్గొన్నారు.

**అధికారులకు ప్రశంసాపత్రాలు**

ఎస్.కోట పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్టవేస్తున్న ఎస్.కోట ఎస్ఐ జి.లోవరాజును ఎస్పీ అభినందించి, బెస్ట్ పెర్ఫార్మర్ జ్ఞాపికను ప్రదానం చేశారు. వివిధ కేసుల్లో నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సీఐలు కె.రవికుమార్, హెచ్.ఉపేంద్ర, జి.సంజీవరావు, ఎస్ఐలు జె.తారకేశ్వరరావు, బి.సాగర్‌బాబు, సిద్ధార్థకుమార్, ఏఎస్ఐలు ఎ.లక్ష్మునాయుడు, ఎస్.భాస్కరరావు, సీహెచ్. ఆరి, ఆర్.అప్పారావు, హెచ్‌సీలు ఆర్.మధుసూదనరావు, డి.శంకరరావు, ఎండి ఇమ్రాన్, హోంగార్డు వై.రాజేంద్రలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు.